క్లుప్తంగా

వైద్యం కోసం ఎమ్మెల్సీ ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్ విజయ్ థామస్

రామకుప్పం: మండలంలోని బల్ల గ్రామ పంచాయతీ అగ్రహారం దిన్నె గ్రామ వార్డు సభ్యురాలు జ్యోతి భర్త మునిరత్నం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ విజయ్ థామస్ చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. అలాగే స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు మరో పదివేల రూపాయలు కలిపి మొత్తంగా రూ.20వేలను జ్యోతికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ్, రెస్కో డైరెక్టర్ థామస్ పాల్గొన్నారు.

బెస్ట్ టీచ్ టూల్ పరిశీలకుడిగా బాలచైతన్య



బాల చైతన్యను అభినందిస్తున్న ఎస్సీఈఆర్టీ నిర్వాహకులు

పలమనేరు: రాష్ట్ర స్థాయిలో బెస్ట్ టీచ్ స్కూల్ పరిశీలకుడిగా పలమనేరు మండలానికి చెందిన ఉపాధ్యాయుడు బాల చైతన్యను ఎస్సీఈఆర్టీ ఎంపిక చేసి. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను ఘనంగా సన్మానించింది. టీచర్ టీచ్ టూల్‌లో భాగంగా ఆయన తరగతి గదిలో టీచర్ల బోధనను పరిశీలించడంలో టాప్‌లో నిలిచారు. ఈనెల 12 నుంచి 16 దాకా రాష్ట్ర స్థాయిలో జరిగిన కార్యక్రమంలో బాల చైతన్య పనితీరుపై సంతృప్తి చెందిన నిర్వాహకులు ఆయన్ను సన్మానించారు. దీంతో ఆయన్ను జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు, జిల్లా హెచ్ఎంల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, ర వీంద్రనాథ్ రెడ్డి అభినందించారు.

స.హ.చట్టం..ఓ పాశుపతాస్త్రం



స.హ.చట్టం కరపత్రాలను విడుదల చేస్తున్న ఆర్టీఐ ప్రతినిధులు

రొంపిచెర్ల: సమాచార హక్కు చట్టం సామాన్యుని చేతిలో పాశు పతాస్త్రం వంటిదని సమాచార హక్కు చట్టం రాష్ట్ర కో–ఆర్డినేటర్ జీవీఎస్.బాబు అన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆదివారం ఆర్టీఐ కరపత్రాలను విడుదల చేసి ఆయన మాట్లాడారు. వివిధ శాఖలలో జరుగుతున్న అవకతవకలను సమాచార హక్కుతో వెలుగులోకి తీసుకురావచ్చన్నారు. దరఖాస్తు చేసిన 30 రోజుల్లోపు స.హ.చట్టం ప్రకారం సమాచారం అధికారులు ఇవ్వాన్నారు. అలా ఇవ్వని పక్షంలో పై అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని, ఈ చట్టంతో ప్రతి ఒక్కరూ న్యాయం పొందవచ్చున్నారు. గ్రామీణులకు ఈ చట్టంపై అవగాహన కల్పించాలని కోరారు. ఆర్టీఐ చిత్తూరు జిల్లా కన్వీనర్ రఘునాథ, రొంపిచెర్ల మండల కన్వీనర్ వెంకటేష్, బీసీ సంఘం నాయకులు నారాయణ స్వామి, బర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి సుధాకర్ రెడ్డి, రాజన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

సోమల: మండల కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చిన్న సోమలకు చెందిన రాజేష్, సూరయ్యగారిపల్లెకు చెందిన నరసింహులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో సదుం వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒకరిని పీలేరు, మరొకరిని తిరుపతి రుయాకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అదుపు తప్పిన కర్ణాటక ఆర్టీసీ బస్సు



ప్రమాదానికి గురైన బస్సు

సదుం: కర్ణాటక ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు.. తిరుపతి నుంచి చిక్‌బళ్లాపూర్‌కు వెళుతున్న బస్సు సదుం మండలంలోని నాగిరెడ్డి చెరువు మలుపు వద్ద స్టీరింగ్‌లో సమస్య తలెత్తడంతో చెరువు పక్కనే ఉన్న మొరవలోకి దూసుకెళ్లింది. అక్కడ మట్టి గడ్డ ఉండడంతో దానిని ఢీకొని నిలిచిపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు.







రాయలపేటలో ముస్తాబవుతున్న చవితి మండపం, విక్రయాలకు ఉంచిన గణపతి ప్రతిమలు, పుంగనూరు : తేరువీధిలో వినాయకుడిని కొలువుదీర్చేందుకు చేసిన ఏర్పాట్లు

వినాయక చవితికి సర్వం సిద్ధం

- జోరుగా వినాయక విగ్రహాల అమ్మకాలు
- ప్రత్యేక అలంకరణలో మండపాలు

పెద్దపంజాణి: ఈ ఏడాది తొలిపూజలు అందుకునేందుకు బొజ్జగణపయ్య సిద్ధమయ్యాడు. వినాయకచవితి వేడుకల్లో భక్తులు నిమగ్నమయ్యారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సందడి ప్రారంభమైంది. మండపాలు, సెట్టింగ్‌లు, వేదికలు ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్నాయి. వివిధ రూపాల్లో ఆకర్షణీయంగా ఉన్న భారీ వినాయక విగ్రహాలను భక్తులు వేలాది రూపాయలతో కొనుగోలు చేసి వాహనాల్లో తరలిస్తున్నారు. పందిళ్లకు విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దడానికి ఏర్పాట్లలో తలమునకలయ్యారు. మండలంలో దాదాపు వంద మండపాలు సిద్ధమవుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది విగ్రహాల ధరలు గణనీయంగా పెరిగాయి. వినాయకచవితి ఉత్సవాల నేపథ్యంలో పండ్లు, పూలు, పూజాసామగ్రి ధరలకు రెక్కలొచ్చాయి.

కొలువుదీరనున్న గణనాథులు

మండలంలోని పలు గ్రామాల్లో బొజ్జ గణపయ్య విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు మండపాలు ఏర్పాటు చేసి, విద్యుత్ దీపాలు, అరటి బోదెలు, మామిడి తోరణాలతో అలంకరించారు. మరోవైపు మైక్‌సెట్‌లు, డీజేలు, వివిధ రకాలైన మండపాలు, లైటింగ్స్‌కు డిమాండ్ పెరిగింది.



పుంగనూరు : కట్టకిందపాళ్యంలో..

నిబంధనలు పాటించాలి

వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు నిబంధనలు విధిగా పాటించాలని పెద్దపంజాణి ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మైక్‌సెట్‌లు పరిమితమైన సౌండ్‌లో ఉంచాలని, రాత్రి 10గంటల తరువాత వాటిని ఆఫ్ చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పుంగనూరులో..

పుంగనూరు: వినాయక చవితి పండుగ నేపథ్యంలో మండలంలో ఎటుచూసినా ఆ పండుగ ఏర్పాట్ల సందడి కనిపిస్తోంది. పట్టణంతోపాటు మండలంలో మొత్తం 173 ప్రాంతాలలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి పందిళ్లు వేసి, విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. పట్టణంలో ఆదివారం పండుగ సంత వ్యాపారం సైతం కళకళలాడింది. పూజకు అవసరమైన మట్టి వినాయకుడి ప్రతిమలు, అరటి, మామిడి, వెలగ, జామ , దానిమ్మ, జిల్లేడు, బిల్వపత్రి , గరికలు, చాటలు, పుటికలు, పండ్ల విక్రయాలు జోరుగా సాగాయి. వినాయకుడికి ప్రీతికరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలతో పట్టణం కిక్కిరిసింది. 10 రోజుల పాటు చవితి ఉత్సవాలు నిర్వహించడానికి ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. సీఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ మోహన్ కుమార్, పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.







పుంగనూరు : వినాయకుడి బొమ్మలు, అరటి పిలకలు విక్రయిస్తున్న వ్యాపారులు

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు



నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులు

గుడుపల్లి: ద్రవిడ వర్సిటీ ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా మూడు రోజుల మండల స్థాయి క్రీడాపోటీలు ఆదివారం ముగిశాయి. మండలంలోని 11 జెడ్పీ హైస్కూళ్ల నుంచి దాదాపు 300మంది బాలబాలికలు అండర్–14, అండర్–17 విభాగాల వివిధ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫీల్డ్ గేమ్స్‌లో కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, బాల్‌బ్యాడ్మింటన్‌తోపాటు ట్రాక్ ఈవెంట్స్‌లో పరుగుపందెం, లాంగ్ జంప్, షాట్ పుట్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన 70 మంది విద్యార్థినీ విద్యార్థులను నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేసినట్లు మండల క్రీడా కో–ఆర్డినేటర్ వేణుగోపాల్ తెలిపారు. పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

ప్రధాని సేవలు ఎనలేనివి



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

వి.కోట: దేశాభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న సేవలు ఎనలేనివని బీజేపీ మండల అధ్యక్షుడు కొంగాటం విజయ్ అన్నారు. ఆదివారం స్థానిక బీజేపీ నాయకులు ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, వైఎస్సార్ సర్కిల్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోపిరెడ్డి, రామచంద్రుడు, శివ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు

పలమనేరు: వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకుడి మట్టితో ఓ మొక్కను నాటాలని పలమనేరు ప్రకృతి ప్రేమికుడు మల్లిచెట్ల దేవేంద్ర విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని లక్ష్మీనగర్‌లో ఆదివారం ఆయన దీనిపై అవగాహన కల్పించారు. వినాయకుడి మట్టితో మొక్కలను పెంచిన వారికి మరో విలువైన మొక్కను బహుమతిగా ఇస్తామన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్ధార్థ, మునిరాజులు తదితరులు పాల్గొన్నారు.

క్యూలను పరిశీలించిన ఏఎస్పీ



కాణిపాక ఆలయ క్యూలను పరిశీలిస్తున్న ఏఎస్పీ

కాణిపాకం(యాదమరి): కాణిపాక ఆలయ పరిసరాల్లో భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలను ఏఎస్పీ సుధాకర్ పరిశీలించారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశుతో కలసి పోలీసు సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి చవితిరోజు కాణిపాకంలో నిర్వహించాల్సిన బందోబస్తుపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వీణా గణపతి రంగుల చిత్రం

యాదమరి: వినాయక చవితి సందర్భంగా యాదమరి ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ దామోదరాచారి జలవర్ణ చిత్రాన్ని చిత్రించారు.



ఊపందుకున్న అక్రమ మైలేర్లు

పలమనేరు: మండలంలో ఎద్దులను పరిగెత్తించి వేగంగా వెళ్లిన వాటికి బహుమతులిచ్చే మైలేర్లు ఊపందుకున్నాయి. రహస్యంగా జరిగే మైలేర్లతో నిర్వాహకులకు కాసుల పంట పండుతోంది. మండలంలోని బయ్యప్పగారిపల్లెలో ఆదివారం మైలేరును నిర్వహించారు. మైలేర్లను నిర్వహించడం చట్టరీత్యానేరమని పోలీసు శాఖ పదేపదే చెబుతున్నా నిర్వాహకులు మాత్రం ఖాతరు చేయడం లేదు. ప్రమాదకరమైన ఈ మైలేర్లలో పశువులు పొడిచి ఎవరైనా మరణిస్తే దీనికి ఎవరు బాధ్యత వహిస్తారనే దానికి నిర్వాహకుల నుంచి సమాధానం ఉండదు. పోలీసులు మైలేర్ల కట్టడికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గాలిమర కరెంట్‌పై అవగాహన

పలమనేరు: ఇంటిపై విండ్ మిల్ ఏర్పాటు చేసుకుంటే పవన విద్యుత్ కారణంగా ఇంటికి కరెంట్ బిల్లు తగ్గుతుందని మండలంలోని మొరం గ్రామానికి చెందిన గ్రామీణ శాస్త్రవేత్త పవన్ ఆదివారం ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆయన పవన విద్యుత్‌పై కలిగే లాభాలను వివరిస్తూ స్థానిక పవన్ ఎంపవర్ సొల్యూషన్స్ కార్యాలయంలో ప్రయోగం చేశారు. ఆసక్తి కలిగిన వారు ఇంటిపై గాలి మరను ఏర్పాటు చేసుకుంటే కరెంటు ఆదా చేసుకోవచ్చన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

పలమనేరు: స్థానిక మదనపల్లె రోడ్డులో విశ్వకర్మ జయంతిని ఆదివారం పట్టణానికి చెందిన విశ్వకర్మ కులస్తులు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మాట్లాడారు. పూర్వకాలంలో తీవ్రక్షామం ఏర్పడి జనానికి ఆహారం లేక ప్రాణాలు పోతుండటం చూసి తట్టుకోలేక, విశ్వకర్మ ఘోర తపస్సు చేసి, భూమి సస్యశ్యామలమయ్యేలా చేశారని పేర్కొన్నారు. పంచకర్మ వృత్తులను సమాజానికి పరిచయం చేసిన మహానుభావుడు విశ్వకర్మ అని స్మరించారు. ఏటా మాఘశుద్ధ త్రయోదశిన విశ్వకర్మ మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ అని, వేద విజ్ఞానాన్ని మానవ జాతికి అందించిన తొలి గురువు విశ్వకర్మ అని కీర్తించారు. అలాంటి మహనీయుని స్మరించేలా ప్రభుత్వం విశ్వకర్మ జయంతి విషయంలో తీసుకున్న నిర్ణయం ఆ కులస్తులకు ఎంతో ఆనందం కలిగించిందన్నారు. అనంతరం అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వి.కోటలో..

వి.కోట: సకల విశ్వకర్మ జయంతిని ఆదివారం మండల విశ్వ బ్రాహ్మణుల సంఘం ఘనంగా నిర్వహించింది. విశ్వకర్మ చిత్రపటాలతో విశ్వ బ్రాహ్మణులు పట్టణంలో ర్యాలీ చేశారు. విశ్వకర్మ సమాజానికి చేసిన మేలును తెలియజేశారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.



వి.కోట: ర్యాలీ చేస్తున్న విశ్వబ్రాహ్మణులు



అన్నదానం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర తదితరులు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి

పలమనేరు: మండలంలోని జగమర్ల వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పట్టణం నుంచి ఓ ఐదేళ్ల బాలుడితో కలసి ఓ వ్యక్తి బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో నలభై ఏళ్ల వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికుల సాయంతో చిత్తూరు ఆస్పత్రికి తరలించారు. బైక్‌పై నున్న బాలుడు క్షేమంగా ఉన్నట్టు తెలిసింది. దీనిపై స్థానిక పోలీసులు విచారణ చేస్తున్నారు.